క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలూరు సీఐ, హొళగుంద ఎస్ఐ

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం శ్రావణ మాసం మూడవ వారంలో భాగంగా మాళ మల్లేశ్వరస్వామి వారికి జలాభిషేకం సుప్రభావ, రుద్రాభిషేకం భండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, అర్చన తదితర పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు వీరభద్రగౌడ్, ఆలూరు సీఐ వెంకటనాయక్, హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

టెంకాయల విక్రయానికి వేలం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాల్లో భక్తులకు టెంకాయాలను విక్రయించేందుకు ఆదివారం దేవరగట్టులో బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో.. హుశేబీడు వీరేశ్‌బాబు రూ.8.15 లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే ఏడాది వరకు వాహనాల పార్కింగ్‌కు సంబంధించి నెరణికి దానప్ప రూ.6.90 లక్షలకు దక్కించుకున్నాడు. వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వేలాల్లో టెంకాయలు అమ్ముకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. వేలం దక్కించుకున్న వారు ఉత్సవాలు ముగిసే లోపు పాడిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కాగా 2023లో టెంకాయల వేలం రూ.5.16 లక్షలకు పోగా..ఈ ఏడాది రూ.8.15 లక్షలకు పలికి రూ.2.99 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ నిర్వాహకులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభం



వంక వద్ద హిటాచీతో పనులు చేస్తున్న దృశ్యం

హాలహర్వి: ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి విజ్ఞప్తి మేరకు ఆర్డీఓ రామలక్ష్మి, అధికారులు స్పందించారు. శనివారం చింతకుంట వంకను ఆర్డీఓ పరిశీలించిన విషయం తెలిసిందే. ప్రొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. వంక వద్ద పెద్ద సైజు పైపులు వేసే పనులు మొదలు పెట్టారు. మూడు రోజుల్లో తాత్కాలిక వంతెన పనులు పూర్తవ్వాలని సంబంధిత అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. హైవే అధికారులు, వీఆర్వో లింగప్ప పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

తుగ్గలి : సీపీఐ బలోపేతానికి శ్రేణులు నిరంతరం కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ఆదివారం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో తుగ్గలి, మద్దికెర మండలాల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో సీపీఐ ముందుడాలన్నారు. కబ్జాకు గురైన అసైన్డ్ భూములు తిరిగి బాధితులకు ఇచ్చేంత వరకు పోరాడాలన్నారు. ఈనెల 28న విజయవాడలో నిర్వహించే భూ బాధితుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, మండల కార్యదర్శులు సుల్తాన్, నాగరాజు, నాయకులు గురుదాస్, వెంకటేశ్వర్లు, ఉమాపతి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ఆలూరు రూరల్: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నరసింహులు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని అరికెర గ్రామ ప్రజలకు అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..యువత మాదక ద్రవ్యాలు తీసుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామంలో కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అజ్ఞాత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు ఓటీపీ చెప్పవద్దన్నారు.

1న రైతాంగ డిమాండ్స్ డే

కర్నూలు(సెంట్రల్): రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన రైతాంగ డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా సమితి సభ్యుడు సురేంద్రయాదవ్ తెలిపారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాటాడారు. కృష్ణానాయక్, మల్లికార్జున, అశోక్ పాల్గొన్నారు.

పోలీసు భద్రత ఉండాల్సిందే



రోగుల ఆరోగ్యం కోసం రేయింబవళ్లు పనిచేసే వైద్య సిబ్బందిపై దాడులు బాధాకరం. ప్రభుత్వాలు ఆస్పత్రుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. మహిళా డాక్టర్లు నైట్ డ్యూటీలు చేయడానికి భయపడే పరిస్థితులున్నాయి. రోగులతో పాటు వారి బంధువులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వైద్యం చేయడంలో కొంచెం ఆలస్యమైనా సిబ్బందిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. ఇలాంటివి వైద్య సిబ్బంది మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి. పోలీసు బందోబస్తు ఉంటే అలాంటివి చోటు చేసుకునే అవకాశముండదు.

– షేక్ ఫైజున్నిసా, అనస్తీషియా స్పెషలిస్ట్, ఆలూరు ప్రభుత్వ వైద్యశాల



నిర్భయంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలి



ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఉదంతం మానవ సమాజానికి మచ్చలాంటిది. ఈ ఘటన తర్వాత వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సీహెచ్‌సీలలో రాత్రివేళ స్టాఫ్ నర్స్ ఒక్కరే విధులు నిర్వర్తిస్తుంటారు. ఆసుపత్రులకు పోలీసు భద్రత కల్పించాలి.

– మయూర్ కుమార్, జనరల్ సర్జన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్,ఆలూరు.

నేడు రథోత్సవం

ఆలూరు: శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ సిద్ధేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ గావించి నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేపడతామని చెప్పారు. చిరగా స్వామి వారి ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింపజేసి ఊరేగిస్తామని ఇందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

పవనమే.. పవర్

- పవన విద్యుత్‌కు అనుకూలంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతం
- ఇప్పటికే ఆలూరు,పత్తికొండ నియోజక వర్గాల్లో 300కు పైగా ఫ్యాన్ల ఏర్పాటు
- మరో 300 ఫ్యాన్ల ఏర్పాటుకు రెన్యూ పవర్ సంస్థ చర్యలు
- వ్యవసాయ భూములకు డిమాండ్.
- ఎకరా రూ.8 లక్షలు పలుకుతున్న వైనం



ఆలూరు సమీప పొలాల్లో ఏర్పాటు చేసిన గాలిమరలు



ఆలూరు మండలం మొలగవల్లి సమీపంలో ఏర్పాటు చేసిన 220 కేవీ పవన విద్యుత్ సబ్ స్టేషన్

ఆలూరు రూరల్: ప్రస్తుతం విద్యుత్ వినియోగం రోజు రోజుకు పెరిగిపోతుంది. గతంలో వేసిన భవిష్యత్ లెక్కలకు మించి వాడకం పెరగడంతో ప్రభుత్వాలు, నిపుణులు విద్యుత్ ఉత్పత్తికి వివిధ మార్గాలు అన్వేషిస్తున్నారు. గతంలో నీరు, బొగ్గు, అణు పదార్థాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసేవారు. రాను రాను వీటి నిల్వలు భారీగా కరిగిపోతుండటం, ఉత్పత్తికి అధిక ఖర్చవుతుండటం కారణంగా తక్కువ ఖర్చులో తయారు చేసే మార్గాలను అనుసరించాలని నిర్ణయించారు. ఇందుకు ప్రకృతి వనరులను వినియోగించాలని తలంచి గాలి, సూర్యరశ్మిని ప్రత్యామ్నాయ వనరులుగా గుర్తించారు. గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అనువైన ప్రాంతాలు, గాలి అధికంగా వీచే ప్రాంతాలు అవసరం. ఇందుకు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అనువైనదిగా గుర్తించి పదేళ్ల క్రితం పవన విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పవన విద్యుత్ కోసం భారీగా ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా పవన విద్యుత్ ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి.

తగ్గుతున్న నీటి లభ్యత

ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తిలో కీలక వాటా జల విద్యుత్‌దే. అయితే ఏటేటా వర్షాలు తగ్గుముఖం పట్టడం, జలాశయాల్లోని నీరు ప్రజల అవసరాలకే సరిపడకపోతున్న కారణంగా ప్రత్యామ్నాయంగా పవన విద్యుత్ వైపు ప్రభుత్వాలు మళ్లాయి. ముఖ్యంగా పవన విద్యుత్ కారణంగా.. కాలుష్య సమస్య కూడా అంతగా ఉండదు. ఈ తరుణంలో విద్యుత్ ఉత్పత్తికి కొత్త సాంకేతికత అందిపుచ్చుకుని ఫ్యాన్లు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రకృతిని ఆసరాగా చేసుకుని వీచే గాలి ద్వారా మరలను ఏర్పాటు చేసి వాటి నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలోని ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో గాలి ఎక్కువగా ఉండడంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో 300 పైగా గాలి మరలు ఉన్నాయి. ఈ ఏడాది ఆలూరు,ఆస్పరి,హాలహర్వి, హొళగుంద మండలాల్లో మరో 300 ఫ్యాన్ల ఏర్పాటుకు రెన్యూ పవర్ సంస్థ సన్నాహాలు చేస్తోంది.

ఒక్కో ఫ్యాన్ నుంచి 2 మెగా వాట్ల విద్యుదుత్పత్తి..

ఒక గాలి మరను ఏర్పాటు చేయడానికి రూ.15 కోట్లు ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక ఫ్యాన్ ఏర్పాటుకు 30 నుంచి 45 రోజుల సమయం పడుతుంది. సెకనుకు 9 కి.మీ. వేగంతో ఫ్యాన్ తిరిగితే రోజుకు 2 మెగా వాట్ల విద్యుత్ తయారవుతుంది. సెకనుకు 6 మీటర్ల వేగంతో రెక్కలు తిరిగితే రోజుకు 1.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సెకనుకు 4 మీటర్ల వేగం కంటే తక్కువ తిరిగితే పవర్ జనరేట్ కాదు. గాలిమరలు గాలిని బట్టి దిశ మార్చుకుంటాయి. ఇవి తానంటత తానే గాలి వేగాన్ని ఆసరాగా చేసుకుని తిరగడం ప్రారంభిస్తాయి. గాలి మరలో అమర్చిన మోటారు ఫ్యాన్ రెక్కలు తిరగడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గాలి మరలో ఏర్పాటు చేసిన స్కాడ్ అనే కేబుల్ ద్వారా ఏదేని సాంకేతిక లోపం తలెత్తితే 220 కేవీ సబ్ స్టేషన్‌కు సంకేతాన్ని పంపుతుంది. దీని ద్వారా సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరిస్తారు.

సబ్‌స్టేషన్ల ఏర్పాటు..

50 నుంచి 70 గాలి మరలకు ఒక 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఈ సబ్ స్టేషన్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను చిప్పగిరి మండలంలోని నంచర్ల, నంద్యాల జిల్లాలోని డోన్, లక్కసాగరం తదితర సబ్ స్టేషన్‌లకు పంపి అక్కడి నుంచి అనంతపురం జిల్లా గుత్తిలోని 400 కేవీ సబ్ స్టేషన్‌కు పంపుతారు. మళ్లీ అక్కడి నుంచి ఆలూరు,ఆదోని,పత్తికొండ, కోడుమూరు, డోన్ తదితర నియోజకవర్గాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

వ్యవసాయ భూములకు డిమాండ్..

గాలి మరలు ఏర్పాటుతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ భూములకు డిమాండ్ పెరిగింది. ఎకరా పొలం రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు పలుకుతోంది. కొంత మంది రైతులు తమ పొలంలో గాలి మరలు ఏర్పాటుకు స్థలాలు విక్రయించి ఆ నగదుతో ఇతర ప్రాంతాల్లో పొలాలు కొంటున్నారు. 2014లో ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాల్లోని ఆలూరు, పత్తికొండ, చిప్పగిరి, ఆస్పరి, కృష్ణగిరి మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. గాలి మరల ఏర్పాటుకు అనువైన పొలాల్లో రైతుల నుంచి 5 ఎకరాల భూమిని లీజుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో 1.5 ఎకరాలను సంబంధిత గాలిమరల కంపెనీ వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. మిగిలిన 3.5 ఎకరాల భూమిని ఎకరాకు ఏడాదికి రూ.25 వేల చొప్పున 30 సంవత్సరాల పాటు లీజు తీసుకుంటారు. 3.5 ఎకరాల పొలంలో రైతు పంటలు సాగు చేసుకోవచ్చు. కాగా గాలి మరల్లో ఏదేని సాంకేతిక లోపం వస్తే వాటి మరమ్మతుల చేయాల్సి వస్తే మిగిలిన 3.5 ఎకరా పొలాన్ని వాడుకోవడానికి హక్కు ఉండేలా అగ్రిమెంట్ చేసుకుంటున్నారు.

నా పొలం మంచి ధర పలికింది



2014లో నా పొలంలో గాలి మరలు ఏర్పాటు చేశారు. ఇందు కోసం 4.5 ఎకరాల పొలం అవసరమైంది. ఇందుకు అప్పటి మార్కెట్ ధర కంటే మంచి ధరే ఇచ్చారు. 1.5 ఎకరా కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన 3 ఎకరాలు 30 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం ఎకరాకు రూ.25 వేలు చొప్పున నాకు కౌలు ఇస్తున్నారు. దీంతో నాకు ఆర్థిక ఇబ్బందులు తీరాయి. ప్రస్తుతం మూడు ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నా.

– జయన్న,రైతు, పోతుగల్లు గ్రామం, కృష్ణగిరి మండలం

ఘనంగా భీరలింగేశ్వరస్వామి కుంభోత్సవం





ప్రత్యేక అలంకరణలో భీర లింగేశ్వరస్వామి, కలశాలతో కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన భీరలింగేశ్వరస్వామి వారికి కురువ కులస్తులు కుంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగపూజ అనంతరం కుంభాన్ని ఊరేగింపుగా స్థానిక ఈర్లకట్ట వద్ద వెలసిన భీరలింగేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయంలో ఆకుపూజ, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

భీమలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురష్కరించుకుని మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, సకల దేవతల స్వాహాకార హోమం జరిపించారు.

లింగమేశ్వరుడికి జలాభిషేకం

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో వెలసిన లింగమేశ్వర స్వామికి ఆదివారం రామతీర్థంలోని గంగను తెచ్చి జలాభిషేకం చేశారు. శంకరబండ నుంచి గ్రామస్తులు సమీపంలోని రామతీర్థం క్షేత్రానికి చేరుకుని మేళతాళాలతో గంగను ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామి వారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు.

నేడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఆలూరు: స్థానిక కర్నూలు– బళ్లారి రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం, శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో సోమవారం గోకులాష్టమి వేడుకలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అర్చకులు నరేంద్రశర్మ, రామ్మూర్తి సమక్షంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు జనార్ధనొట్టి, భాస్కర్, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే..మొలగవెల్లి, అరికెర, కురుకుంద ముద్దనగేరి, తదితర గ్రామాల్లో యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని ఊరేగిస్తారు.

పుల్లగుమ్మిలో ఉచిత వైద్యశిబిరం

వెల్దుర్తి: మండలంలోని పుల్లగుమ్మి గ్రామంలో ఆదివారం కర్నూలు అమీలియా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు గుండె జబ్బులు, షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, కంటి శుక్లం వంటి వ్యాధులకు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామపెద్దలు నాగేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు.

నివాళి

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శేషిరెడ్డి (55) ఈ నెల 18న రాత్రి ఆలూరు నుంచి గ్రామానికి బైక్ వెళ్తూ కుక్కను తప్పించబోయి కిందపడి గాయపడ్డాడు. చికిత్స కోసం కర్నూలు అసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు కుమారుడు ప్రశాంత్ రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. లింగారెడ్డి,సురేష్ రెడ్డి,ఓబులేసు ఉన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తిణి కె.హేమ

ఆలూరు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు సివిల్ జూనియర్ కోర్టు జడ్జి కె.హేమ సూచించారు. ఆదివారం స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో బ్రెయిలీ లిపి భగవద్గీత ఆలయంలో ఆలయ శాశ్వత కమిటీ నిర్వాహకుడు అంధత్వ ఉపాధ్యాయుడు బూర్ల లక్ష్మన్న ఆధ్వర్యంలో తెలుగు, సంస్కృతంలో బ్రెయిలీ లిపిలో ముద్రించిన భగవద్గీతను శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా ఆమె ఆవిష్కరించారు. అంతకు ముందు రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులకు భవగద్గీతలోని సారాంశాలపై వ్యాసచరన, వక్తృత్వపు పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తంరావు, తెలుగు అధ్యాపక, ఉపాధ్యాయులు, రిటైర్డు ఎంఈఓ రామలింగమ్మ, సాంస్కృతిక సిద్ధాంతుడు సిద్ధయ్య పాల్గొన్నారు.



ఈరన్న స్వామి వారి దర్శనానికి క్యూలో వస్తున్న భక్తులు

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా నాల్గవ సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. ఈ ఉత్సవాల్లో సోమవారాలకు ప్రత్యేక స్థానం ఉంది భక్తులు లక్షల్లో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఇందులో భాగంగానే నాల్గవ సోమవారం స్వామి దర్శనార్థం భక్తులు ఆదివారం నుంచే తరలివస్తుండడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శన సౌకర్యం కల్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాత్రి కూడా దర్శనాలు ఉంటాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం

ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా వాస్తవ్యులు శ్రీదేవి, విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,001 ఆదివారం అందజేసినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు.

వరద వస్తే సర్దుకోవాల్సిందే

- లోతట్టు ప్రాంతంలో ముత్తుకూరులోని దళిత కాలనీ
- వర్షం వచ్చినప్పుడల్లా పొంగుతున్న హంద్రీ వాగు
- ఇళ్లల్లోకి వస్తున్న వరద
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దళిత కాలనీలోకి వచ్చిన వరద నీరు (ఫైల్)

ఆస్పరి: వర్షం కురిసిన ప్రతిసారి వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. తమ గుడిసెల్లోకి వాగునీరు వచ్చి ముంచెత్తుతుందేమోనని విలువైన వస్తువులు, తిండిగింజలు, సామగ్రితో ఎగువ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ముత్తుకూరు గ్రామ దళిత కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని హంద్రీ వాగు సమీపంలోనే వంద కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నారు. ఇందులో 10 మందికి మించి పక్కా ఇళ్లులేవు. మిగిలినవన్నీ నాపరాళ్లతో వేసుకున్న చిన్న గుడిసెలే. చిన్న పాటి వర్షం కురసినా ఆరోజు రాత్రి వారికి నిద్ర ఉండదు. నాపరాళ్ల గుడిసెలు కావడం వల్ల వరద నీరు నేరుగా గుడిసెల్లోకి వచ్చేస్తాయి. అన్నీ సర్దుకుందామనే లోపే తిండి గింజలు, బట్టలు తడిసి పోతాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ముత్తుకూరు గ్రామం పైభాగన ఉన్న మద్దికెర, చిన్నహుల్తి, పెద్దహుల్తి, హోసూరు, మొలగవల్లి గ్రామాల్లో భారీ వర్షం పడిందంటే హంద్రీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో వాగులో ప్రవహిస్తున్న నీటి శబ్దానికే తమకు భయమేస్తుందంటున్నారు. ఈనెల 19న రాత్రి భారీ వర్షం కురవడంతో కాలనీలోని రాజు, కృష్ణ, రాజశేఖర్, రంగస్వామి, చిన్నలాలు, అంజి, సోమశేఖర్, రంగప్ప, శేఖమ్మ, తిక్కమ్మ, దేవేంద్ర, శివలక్ష్మి, హనుమంతమ్మ, సువర్ణ, మహేశ్వరీ గుడిసెల్లో ఉన్న తిండి గింజలు, బట్టలు కొట్టుకుపోయాయి. ఈనెల 20న అధికారులు పరిశీలించి వెళ్లారే కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి సహాయం చేయలేదని చెబుతున్నారు. ఇలా ఏటా తాము ఉన్నవన్నీ కోల్పోయి కట్టుబట్టలతో మిగులుతున్నామని, ప్రభుత్వాల నుంచి సాయం అందడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఊరికి పై భాగంలో స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలని కోరుతున్నారు.

వర్షం వస్తుందంటే భయమేస్తుంది



తమ కాలనీ ముత్తుకూరులోని హంద్రీ వాగుకు సమీపంలో ఉంది. వర్షం వచ్చిందంటే మాకు నిద్ర ఉండదు. పై భాగంలో ఉన్న మద్దికెర, మొలగవల్లి, హోసూరు, చిన్నహుల్తి గ్రామాల్లో పెద్ద వర్షం పడితే హంద్రీ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈనెల 19న రాత్రి ఒక్కసారిగా వరద నీరు మా గుడిసెలోకి రావడంతో పిల్లాపాపలతో భయంతో పరుగులు తీశాం. తిండి గింజలు, బట్టలు వరదలో కొట్టుకుపోయాయి.

– శివలక్ష్మి ముత్తుకూరు గ్రామం

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



ఎగువ గ్రామాల్లో వర్షాలు వస్తే మా కాలనీలోకి వరద నీరు ఎప్పుడొస్తోందో తెలియదు. మేం సురక్షితంగా ఉండాలంటే ఊరికి పై భాగంలో ప్రభత్వం స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. ఎన్నాళ్లు ఇలా వరద భయంతో బతకాలి. ఇటీవల మా కాలనీలోకి వచ్చిన వరదకు మా గుడిసె దెబ్బతినింది. గుడిసెకు మరమ్మతులు చేసుకునేందుకు కూడా మాతో డబ్బులు లేవు.

– మహేశ్వరి, గ్రామస్తురాలు

అర్ధరాత్రి వరద వస్తే మా పరిస్థితి అంతే



అర్ధరాత్రి వరద వస్తే దిక్కుతోచని పరిస్థితి. ఎప్పుడైన కాలనీలోకి వరద నీరు వస్తుందంటే సామాన్లు సర్దుకునేలోపు ముంచెత్తుతుంది. అలాంటి సమయాల్లో గుడిసెల్లో ఏమున్నా సరే వదిలేసి పరుగులు తీస్తాం. కొంత ఆలస్యమైనా వరదలో కొట్టుకుపోవాల్సిందే. ప్రభుత్వం ఆలోచించి తమకు సురక్షితమైన ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– సువర్ణ, స్థానికురాలు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



తుగ్గలిలో లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న పొదుపు మహిళలు



పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ చెక్కు అందిస్తున్న దృశ్యం



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఏపీఎం

తుగ్గలి : ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో లైవ్ టెలికాస్ట్ ద్వారా పొదుపు మహిళలు తిలకించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని లక్షాధి కారులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ముద్ర రుణాల కింద 22 మందికి రూ.22 లక్షలు, బ్యాంకు లింకేజీ కింద ఈనెల మాత్రమే 78 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.22 కోట్లకు సంబంధించిన మెగా చెక్కులను అందించారు. సర్పంచ్ రవి, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు చంద్రమ్మ, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి అండగా నిలవాలని సర్పంచ్ బండారు సుహాసిని, ఐకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లఖ్‌పతి దీదీ పథకంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్త్రీలకు ఎల్ఈడీ బల్బుల తయారీ, పశుపోషణ, పుట్టగొడుగుల పెంపకం వివిధ రకాలు నైపుణ్యాలను నేర్పించడమే గాకుండా వడ్డీ లేని రుణాలు అందించి స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించిన ధ్రువ పత్రాలు అందజేశారు.

హాలహర్వి: ప్రతి మహిళ లక్షాధికారి కావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జెడ్పీటీసీ లింగప్ప అన్నారు. ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో లఖ్‌పతి దీదీ పథకం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు బ్యాంకుల ద్వారా జీవనోపాధి కార్యక్రమాలకు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో ఇస్తరాకుల తయారీ సెంటర్, గూళ్యం గ్రామంలో జొన్న రొట్టెల తయారీ సెంటర్, హాలహర్విలో ఎంబ్రాయిడింగ్ ద్వారా తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. వెలుగు ఏపీఎం శివయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరత్నం, మౌలాసాబ్, గోవిందప్పలు, అకౌంటెంట్ నరసింహులు పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక స్త్రీ శక్తి భవన్ కార్యాలయంలో ఆదివారం ఏపీఎం రమేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహారాష్ట్రలో ప్రారంభించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని మహిళలతో కలిసి లైవ్‌లో తిలకించారు. కార్యక్రమంలో లక్షాధికారులైన ఐదుగురు మహిళలను సత్కరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణగిరి: పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం మహేశ్వరయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన లఖ్‌పతి దీదీ యోజన కార్యక్రమం కింద పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి అనంతరం వారికి బ్యాంక్ రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 24 గ్రూపులకు రూ.1.44 కోట్ల బ్యాంకు రుణాలు అందజేశామన్నారు. ఈ పథకం కింద గ్రూపు సభ్యులకు ఐదు లక్షల వరకు వడ్డీ లేకుండా రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు ఎల్లప్ప పాల్గొన్నారు.